విలేకరులు కావలెను

పవర్ జాతీయ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను.

ఆసక్తి కలవారు, అనుభవం కలవారుసంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్‌లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాలవారీగా విలేకరులు కావలెను

సీనియర్లకు ప్రాధాన్యత, కొత్తవారికి అవకాశం ఉంటుంది

ఇంచార్జ్ : పొన్నం మహేష్‌గౌడ్

90004 88885



Dr.PRK

# పవర్

పోరాడితే పోయేదేమి లేదు బానిస సంకెళ్ళు తప్ప



రామకృష్ణ హాస్పిటల్స్

పక్షవాతం, డిస్క్ సమస్యలు,

నడుమునొప్పి,

మెడ నొప్పులకు

పూర్తి చికిత్స కలదు.



నిరుపేదలకు ఉచిత వైద్యం

రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్

విజయ టాకీస్ దగ్గర, హనుమాన్ టెంపుల్ లైన్, హనుమకొండ

సెల్:9849485100



సంపుటి : 01 సంచిక : 307 | బుధవారం 5 ఆగస్టు 2026 | పేజీలు : 4 | వెల : 4


## ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు

# రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలు

### ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలు

**రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు విదేశీ పర్యటనలకు వెళ్లనున్న సీఎం - మంగళవారం రాత్రి ఢిల్లీకి వెళ్లనున్న ముఖ్యమంత్రి**



హైదరాబాద్, పవర్ న్యూస్

రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలకు వెళ్లనున్నారు. ఈనెల 17 నుంచి సెప్టెంబరు 10 మధ్య నాలుగు దేశాల్లో పర్యటించేందుకు ఏర్పాట్లు చేశారు. యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి బృందం పర్యటించనుంది. పలువురు పారిశ్రామిక వేత్తలతో సమావేశాలు కానున్నారు. ఫ్యూచర్‌సిటీలో పెట్టుబడులతో పాటు రాష్ట్రంలో విదేశీ యూనివర్సిటీలు, క్రీడలు, శిక్షణ సంస్థల భాగస్వామ్యంపై చర్చించనున్నారు. ఈనెల 16న ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించి 21ఏళ్లకే చట్టసభలకు పోటీ చేసే అవకాశం ఉండాలంటూ తీర్మానం చేసే అవకాశం ఉంది. ఇవాళ రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిల్లీ వెళ్లనున్నారు. రేపు అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు అనుమతులు, నిధులపై చర్చించనున్నారు.

ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు : తెలంగాణలో ప్రపంచస్థాయి విద్యా ప్రమాణాలను తీసుకురావడం, యువతలో అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను పెంపొందించడం, క్రీడారంగాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన చేపట్టనున్నారు. ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు విదేశీ పర్యటన చేయనున్నారు. హైదరాబాద్ నుంచి ముందుగా యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)కు, అక్కడి నుంచి అమెరికాకు సీఎం వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం : ఈ పర్యటనలో ముఖ్యమంత్రి సలహాదారు కె.రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొనే అవకాశం ఉంది. ఆయా దేశాల్లో ప్రభుత్వ, విద్యా, క్రీడా రంగాలకు చెందిన ప్రముఖులతో సమావేశాలు నిర్వహించి తెలంగాణ అభివృద్ధికి అవసరమైన సహకారంపై చర్చించనున్నారు.

ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలతో చర్చలు : యూకే, అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ముఖ్యమంత్రి సందర్శించనున్నారు. తెలంగాణలో ఉన్నత విద్యను అంతర్జాతీయ ప్రమాణాలకు తీసుకెళ్లే దిశగా విద్యాసంస్థల ప్రతినిధులతో సమావేశమై పరస్పర అవగాహన ఒప్పందాలు (వీశీఖ) కుదుర్చుకునే అవకాశాలున్నాయి. ఇప్పటికే కొన్ని విదేశీ విశ్వవిద్యాలయాలు తెలంగాణలో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో, మరిన్ని ప్రముఖ సంస్థలను రాష్ట్రానికి ఆహ్వానించే ప్రయత్నాలు జరగనున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే

..మిగతా 2లో



## బీఆర్ఎస్ పార్టీకి క్షుద్రపూజలు చేయడం

# ఒక అలవాటు

**అక్కడకు హరీశ్ రావు ఎందుకు వెళ్లారు?: మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు**

**బీఆర్ఎస్‌కు క్షుద్రపూజలు చేయడం అలవాటని టీపీసీసీ చీఫ్ ఆరోపణ**

**మాజీ మంత్రి హరీశ్ రావు ఆలయాల పర్యటనలపై ప్రశ్నలు**

**జూన్ 2, జులై 23 తేదీల్లో హరీశ్ ఎక్కడున్నారో చెప్పాలని డిమాండ్**

**పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని పట్టించుకోలేదన్న మహేష్ గౌడ్**

**తెలంగాణ ప్రజలకు ఆ పార్టీ క్షమాపణ చెప్పాలని వ్యాఖ్య**

హైదరాబాద్, పవర్ న్యూస్

బీఆర్ఎస్ పార్టీకి క్షుద్రపూజలు చేయడం ఒక అలవాటుగా మారిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఇటీవల కొన్ని ఆలయాలను సందర్శించడంపై ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేశ్ గౌడ్ మాట్లాడారు. జూన్ 2న తిరుచ్చి, జులై 23న శివమొగ్గకు హరీశ్ రావు ఎందుకు వెళ్లారని ఆయన నిలదీశారు. ఆయా తేదీల్లో హరీశ్ రావు ఎక్కడ ఉన్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలకు సంబంధించి తన వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని మహేశ్ గౌడ్ వెల్లడించారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ తెలంగాణకు చేసిందేమీ లేదని, అందుకే ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో ప్రజల నమ్మకాన్ని బీఆర్ఎస్ పూర్తిగా కోల్పోయిందని ఆయన పేర్కొన్నారు. చేసిన తప్పులకు గాను బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## పోలీసు నియామకాల్లో పూర్తి పారదర్శకతకు

# సీఎం రేవంత్ రెడ్డి కట్టుబాటు హర్షణీయం

**- డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ**

హనుమకొండ, ఆగస్టు 4, పవర్‌న్యూస్

తెలంగాణ రాష్ట్రంలో 7,437 పోలీసు ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం ఎంతో హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అన్నారు.ప్రశ్నపత్రాల తయారీ నుంచి పరీక్షల నిర్వహణ వరకు ప్రతి దశలో అత్యున్నత భద్రతా ప్రమాణాలు పాటించాలని, కోచింగ్ సెంటర్లు, సైబర్ మోసాలు, నకిలీ వెబ్‌సైట్లు, దుష్ప్రచారాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించడం ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనమని పేర్కొన్నారు. నిజాయితీగా శ్రమించి ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న ప్రతి అభ్యర్థికి న్యాయం జరగాలని, ఎలాంటి అక్రమాలకు, అవాంఛనీయ శక్తులకు అవకాశం లేకుండా నియామక ప్రక్రియ నిర్వహించడం ప్రజా ప్రభుత్వ బాధ్యత అని సీఎం చెప్పిన మాటలు యువతలో విశ్వాసాన్ని పెంచుతున్నాయని అన్నారు.రాష్ట్ర భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో వేలాది మంది అర్హులైన యువతకు పోలీసు శాఖలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా శాంతి భద్రతల వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అభిప్రాయ పడ్డారు. ప్రజల భద్రత, యువత ఉపాధి, పారదర్శక పాలన అనే మూడు లక్ష్యాలను ఒకేసారి సాధించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు తీసుకుంటున్న చర్యలు తెలం గాణ రాష్ట్ర భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ నిర్ణయం రాష్ట్ర యువతకు కొత్త ఆశలు నింపడంతో పాటు తెలంగాణ పోలీసు వ్యవస్థను మరింత సమర్థ వంతంగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుందని డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అన్నారు.





## హైదరాబాద్‌కు

# భారీ వర్ష సూచన

### ఎల్లో అలర్ట్ జారీ

2లో..

**వాయుగుండం కారణంగా తెలంగాణలో భారీ వర్షాలు**

**హైదరాబాద్ లో నేడు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం**

**వాహనదారులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్న అధికారులు**

# లైంగిక దాడి ఆరోపణలు

## హైకోర్టులో రేగా కాంతారావు పిటిషన్

**తనపై నమోదైన కేసును కొట్టివేయాలని హైకోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే**

**ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి లైంగిక దాడి చేసి, రూ. 5 లక్షలు తీసుకున్నారని యువతి ఫిర్యాదు**

**ఈ ఆరోపణలు అవాస్తవమని, తన ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర అని కాంతారావు వాదన**

**నాలుగేళ్ల నాటి ఘటనపై ఇప్పుడు ఫిర్యాదు చేయడం చట్టవిరుద్ధమన్న మాజీ ఎమ్మెల్యే**



హైదరాబాద్, పవర్ న్యూస్

తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. లైంగిక దాడి, మోసం ఆరోపణలతో హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని ఆయన తన పిటిషన్‌లో అభ్యర్థించారు. ఉద్యోగం ఇప్పిస్తానని, టీవీ ఛానల్ ఏర్పాటుకు సహకరిస్తానని నమ్మించి రేగా కాంతారావు తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా,

..మిగతా 2లో

# ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే బాస్: జగ్గారెడ్డి

**తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు**

**7 పేజీలతో నివేదికను పీసీసీ చీఫ్ కు అందించిన జగ్గారెడ్డి**

**అందరి నుంచి అభిప్రాయాలను సేకరించి నివేదికను తయారు చేశామన్న జగ్గారెడ్డి**

హైదరాబాద్, పవర్ న్యూస్

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు, వర్గపోరు అంశంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ పరిశీలకుడు జగ్గారెడ్డి తన సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. మొత్తం 7 పేజీలతో కూడిన ఈ



మిగతా 2లో

## ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు

# రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలు

**మొదటి పేజీ తరువాయి...**

స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటైన నేపథ్యంలో, అంతర్జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థలను తెలంగాణకు తీసుకురావడంపై కూడా ఈ పర్యటనలో ప్రత్యేక దృష్టి సారించనున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు ఆధునిక శిక్షణ అందించే విధంగా విదేశీ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

క్రీడాభివృద్ధికి కొత్త ప్రణాళికలు : తెలంగాణ యువత ఒలింపిక్స్ సహా అంతర్జాతీయ క్రీడల్లో పతకాలు సాధించాలని రేవంత్ రెడ్డి పలు మార్లు ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో యూకే, అమెరికాలోని ప్రముఖ క్రీడా అకాడమీలు, శిక్షణా కేంద్రాలను సందర్శించి అక్కడ అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయనున్నారు. రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా మౌలిక వసతులు, శిక్షణా వ్యవస్థలను అభివృద్ధి చేసే అంశాలపై నిపుణులతో చర్చించే అవకాశముంది.

తెలంగాణ అభివృద్ధికి కొత్త అవకాశాలు : ఈ విదేశీ



పర్యటన ద్వారా విద్య, నైపుణ్యాభివృద్ధి, క్రీడా రంగాల్లో తెలంగాణకు ప్రపంచస్థాయి భాగస్వామ్యాలను

తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు, ప్రముఖ విశ్వవిద్యాలయాల సహకారం, ఆధునిక శిక్షణా విధానాల అమలు ద్వారా రాష్ట్ర యువతకు కొత్త అవకాశాలు కల్పించడంతో పాటు తెలంగాణను విద్యా, నైపుణ్యాలు, క్రీడల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఈ పర్యటన కీలకంగా మారే అవకాశం ఉంది.

పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీని పకడ్బందీగా నిర్వహించాలి: సీఎం

పోలీసు ఉద్యోగాల భర్తీపై ఇంటెలిజెన్స్ వర్గాలు సీఎంకు కీలక సమాచారం ఇచ్చారు. నియామక ప్రక్రియకు అడ్డుకోవాలని కొన్ని పార్టీలు చూస్తున్నట్లు సమాచారం. "పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీని పకడ్బందీగా నిర్వహించాలి. నియమ నిబంధనలను అనుసరించి లోపాలు లేకుండా చూడాలి. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణాలో అప్రమత్తంగా ఉండాలి. పరీక్ష కేంద్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి. కోచింగ్ సెంటర్స్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి. నియామక పరీక్షల నిర్వహణపై దుష్ప్రచారం అరికట్టాలి." సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

# యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై వివరణ ఇవ్వండి

## ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, పవర్ న్యూస్

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ట్రస్టు బోర్డు ఏర్పాటుపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు - వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ట్రస్టు బోర్డు ఏర్పాటుపై వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బోర్డు ఏర్పాటు నిమిత్తం తీసుకువచ్చిన చట్ట సవరణతో పాటు బోర్డు ఏర్పాటుపై ప్రభుత్వంతో పాటు ట్రస్ట్ బోర్డు చైర్మన్, సభ్యులకూ నోటీసులు జారీ చేసింది. ఆలయానికి ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయవచ్చు : దేవాదాయ శాఖ చట్టానికి సవరణ తీసుకువస్తూ చేర్చిన సెక్షన్లు 96, 97లతో పాటు ఆలయానికి ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జూన్ 30న జారీ చేసింది. ఈ జీవోను సవాలు చేస్తూ నాగిళ్ల శ్రీనివాస్, వ్యవస్థాపక ట్రస్టీ నరసింహ మూర్తిలు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారణ చేపట్టింది. రూ.100 కోట్ల ఆదాయం ఉన్న ఆలయానికి ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయవచ్చని, అందులో ఎమ్మెల్యేతోపాటు వంశపారంపర్య ధర్మకర్త తదితరులు సభ్యులుగా ఉంటారని పేర్కొందని, ఇది చట్టవిరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. గతంలో సుప్రీం కోర్టు వెలువరించిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ట్రస్ట్ బోర్డు ఏర్పాటైందని పేర్కొన్నారు. ఈ తీర్పు ప్రకారం వంశపారంపర్య ధర్మకర్త ఉన్నపుడు ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేస్తే దానికి చైర్మన్‌గా వంశపారంపర్య దర్మకర్తనే నియమించాలని స్పష్టంగా ఉ




ందన్నారు. వారికి ప్రత్యేక హక్కును కల్పించిందన్నారు. వ్యవస్థాపక ట్రస్టీకి ఉన్న ప్రత్యేక హోదాను తగ్గించి కేవలం ఒక సభ్యుడిగా మాత్రమే నియమించారన్నారు. అంతేగాకుండా రాజ్యాంగంలోని అధికరణ 24, 25 ప్రకారం ఆలయ బోర్డులో ప్రజాప్రతినిధులకు అవకాశం ఇవ్వకూడదన్నారు. ఆలయ నిత్య కైంకర్యాలు, పూజావిధానాలు, ఉత్సవాలు, ఆగమ సంప్రదాయాల నిర్వహణ వంటి అత్యంత కీలక బాధ్యతలను అప్పగించిందన్నారు. పలువురికి నోటీసులు జారీ : ఇవి కేవలం పరిపాలనాపరమైన అంశాలే కాకుండా మతపరమైనవని, అందువల్ల ఇలాంటి వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యంతో హిందూ మత సంస్థలకు రాజ్యాంగం కల్పించిన స్వయం ప్రతిపత్తి దెబ్బతింటోందన్నారు. వాదనలను విన్న ధర్మాసనం సీఎస్, దేవాదాయశాఖ కమిషనర్, ఆలయ ఈవో, చైర్మన్ ఎం.సత్యనారాయణ రెడ్డికి నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసు-అదనపు ఛార్జిషీట్‌కు సిద్ధమవుతున్న సిట్

హైదరాబాద్, పవర్ న్యూస్

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఈ నెల 15లోపు ఛార్జిషీట్ దాఖలు చేసేందుకు సిట్ కసరత్తు - ముగ్గురు నేతల పేర్లు చేర్చే అంశాన్ని సిట్ పరిశీలిస్తున్నట్లు సమాచారం

తెలంగాణలో తీవ్ర సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో అదనపు ఛార్జిషీట్‌కు సిట్ సిద్ధమవుతోంది. ఈ నెల 15లోపు ఛార్జిషీట్ దాఖలు చేసేందుకు సిట్ కసరత్తు చేస్తోంది. నేతల పేర్లు చేర్చాలా వద్దా అనే అంశంపై న్యాయసలహాలు తీసుకుంటున్నారు. ముగ్గురు నేతల పేర్లు చేర్చే అంశాన్ని సిట్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటివరకు 600 మంది వాంగ్మూలాలను సిట్ నమోదు చేసింది. 600 మంది స్టేట్‌మెంట్ల ఆధారంగా అదనపు ఛార్జిషీట్ సిద్ధం చేస్తున్నారు. ఆ 15 రోజుల్లో 4013 మందిపై నిఘా : ముగ్గురినీ నిందితులుగా చేర్చే విషయంలో ప్రత్యేక దర్యాప్తు బృందం పెద్దఎత్తున కసరత్తు చేసినట్లుగా సమాచారం. కీలక సాక్ష్యాధారాల సేకరణ క్రమంలో వందలమంది వాంగ్మూలాలను అధికారులు సేకరించారు. 2023 నవంబరు 15 నుంచి 30వ తేదీ వరకు స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ కేంద్రంగా జరిగినట్లుగా చెబుతున్న ఫోన్ అక్రమ ట్యాపింగ్ వ్యవహారంపైనే కీలక దృష్టి సారించారు. ఆ 15 రోజుల్లో 4013 మందిపై నిఘా ఉంచినట్లుగా ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తులో తేలింది. వారిలో 618 మందికి సంబంధించిన ఫోన్ సంభాషణల్ని అక్రమంగా విన్నట్లుగా గుర్తించారు. ఆ వివరాలను ముందుంచుకుని కేసు ప్రధాన నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ మాజీ సీవోవో టి.ప్రభాకర్‌రావును విచారించింది. అయితే ఆయన పోలీస్ ఉన్నతాధికారులపైనే నెపం నెట్టేసినట్లు సమాచారం. వారి ఆదేశాల మేరకే తాను పనిచేశానని చెప్పినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తును కొలిక్కి తెచ్చేందుకు ఓ మాజీ డీజీపీతో పాటు గత ప్రభుత్వంలో నిఘా విభాగంలో పనిచేసిన ఓ ఉన్నతాధికారి వాంగ్మూలాలను కూడా ఇటీవల సిట్ సేకరించినట్లు సమాచారం. గత ప్రభుత్వంలో సీఎంవోలో(ముఖ్యమంత్రి కార్యాలయం), హోంశాఖలో పనిచేసిన ఉన్నతాధికారుల నుంచీ వాంగ్మూలాలు తీసుకుంది. ఆయా అంశాలన్నిటినీ క్రోడీకరించడంతో పాటు దర్యాప్తులో తేలిన సమాచారం ఆధారంగానే బీఆర్ఎస్ ముఖ్యుల్ని నిందితులుగా చేర్చుతూ అనుబంధ అభియోగపత్రాన్ని రూపొందించినట్లుగా తెలుస్తోంది. ఒక్కొక్కరి పాత్రపై ఆధారాలు ఒకరికి మినహాయింపు : తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ అక్రమ ట్యాపింగ్ వ్యవహారంలో ఆ ముగ్గురు నాయకుల పాత్ర ఏమిటనేది అభియోగపత్రంలో సిట్ కూలంకషంగా పొందుపరిచినట్లు సమాచారం. ప్రభాకర్‌రావు నియామకంలోనే మతలబు దాగి ఉందని మొదటి నుంచీ అనుమానిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం, ఆ దిశగా దర్యాప్తు చేసి వీరిలోని ఓ ప్రముఖుడి పాత్రను నిగ్గు తేల్చినట్లు సమాచారం. అలాగే బీఆర్ఎస్‌కు ఎలక్టోరల్ బాండ్ల విషయంలో మరొకరిని ఎవరిపై అక్రమంగా నిఘా ఉంచాలనే విషయంపై ఆదేశాలివ్వడంలో ఇంకొకరి పాత్రపై ఆధారాలను సేకరించినట్లు సమాచారం. వీరితోపాటు మరో కీలక మాజీ ప్రజాప్రతినిధినీ గతంలో విచారించినప్పటికీ ఆయన పేరును మాత్రం అభియోగపత్రంలో చేర్చలేదని తెలిసింది.

## ప్రముఖ నటుడు ప్రదీప్ సింగ్ రావత్ కన్నుమూత- సినీ ప్రముఖుల సంతాపం

హైదరాబాద్, పవర్ న్యూస్



గుండెపోటుతో కన్నుమూసిన ప్రదీప్ సింగ్ రావత్- సోషల్ మీడియాలో సంతాపం తెలిపిన అనేక మంది ప్రముఖులు ప్రముఖ నటుడు ప్రదీప్ సింగ్ రావత్ (74) తుదిశ్వాస విడిచారు. ముంబయిలోని నివాసంలో గుండెపోటుతో ఆయన మంగళవారం కన్నుమూశారు. తన నటనతో ఇప్పటికే మంచి క్రేజ్ సొంతం చేసుకున్న ప్రదీప్ సింగ్ రావత్ మరణం పట్ల అనేక మంది సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలిపారు.

**ప్రదీప్ సింగ్ సినీ జర్నీ**

1952లో దిల్లీలో జన్మించిన ప్రదీప్ సింగ్ రావత్, తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళతోపాటు ఇతర భాషల్లో యాక్ట్ చేశారు. అలాగే కొన్ని దూరదర్శన్ టీవీ సీరియల్స్‌లో కూడా నటించారు. కెరీర్ తొలి రోజుల్లో ఎక్కువగా విలన్‌గా నటించిన ప్రదీప్ రావత్, ఆ తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కూడా చేశారు. 1985లోనే ప్రదీప్ రావత్ సినీ ప్రయాణం మొదలైంది. బాలీవుడ్‌లో రాజ్ బబ్బర్ ఐత్ బార్ సినిమాలో తొలిసారి ఓ చిన్న పాత్రలో కనిపించారు ప్రదీప్ రావత్.

ఆ తర్వాత చాలా సినిమాల్లో నటిస్తూ వచ్చినా అక్కడ అనుకున్న రేంజ్‌లో పేరు సంపాదించలేకపోయారు. కొన్ని సినిమాల్లో మాత్రమే ఆడియన్స్‌కు గుర్తుండిపోయే రోల్స్ దక్కాయి. తెలుగులో నితిన్ - రాజమౌళి సై (2004) మూవీతో ఆయన టాలీవుడ్ జర్నీ ప్రారంభమైంది. భిక్షూ యాదవ్‌గా ఆయన పండించిన విలనిజానికి అద్భుతమైన స్పందన వచ్చింది. ఆ తర్వాత వరుసగా తెలుగులో వరుస అవకాశాలు అందుకున్నారు.

భద్ర, అందరివాడు, ఛత్రపతి, లక్ష్మీ, స్టాలిన్, దేశముదురు, యోగి, జగడం, గజిని, మస్కా, ఓయ్, రెబల్, నాయక్, బాద్షా, వన్ నేనొక్కడినే, అల్లుడు శీను, నేను శైలజ, సరైనోడు, నేనే రాజు నేనే మంత్రి, జై లవ కుశ, వాల్తేరు వీరయ్య తదితర టాలీవుడ్ సినిమాల్లో నటించి అందరినీ ఆకట్టుకున్నారు. చివరగా 2026 మే 1వ తేదీన రిలీజ్ అయిన గాయపడ్డ సింహం మూవీలో కనిపించారు. అయితే తన కెరీర్‌లో ఫిల్మ్ ఫేర్ బెస్ట్ విలన్, సంతోషం బెస్ట్ విలన్, నంది అవార్డులు అందుకున్నారు ప్రదీప్ సింగ్ రావత్.

## పురుషులను గౌరవించడం మన సంప్రదాయం: టీజీఎస్ఆర్టీసీ బస్సులో బోర్డు!

**టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను ఆకర్షిస్తున్న కొత్త బోర్డు**
**పురుషులను గౌరవించి వారి సీట్లలో కూర్చోనివ్వాలని సూచన**
**ఈ బోర్డుపై టీజీఎస్ఆర్టీసీ నుంచి రాని అధికారిక ప్రకటన**

హైదరాబాద్, పవర్ న్యూస్




తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) బస్సులో కొత్తగా కనిపించిన బోర్డు ప్రస్తుతం ప్రయాణికుల దృష్టిని ఆకర్షిస్తోంది. "పురుషులను గౌరవించడం మన సంప్రదాయం.. వారి కోసం కేటాయించిన సీట్లలో వారినే కూర్చోనిద్దాం" అనే సందేశంతో కూడిన ఈ బోర్డు బస్సుల్లో దర్శనమివ్వగా, దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో బస్సుల్లో ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరిగింది. మహిళా ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరగడంతో, పురుషుల కోసం కేటాయించిన సీట్లలో సైతం ఇతరులు కూర్చుంటున్నారని, దీనివల్ల టికెట్లు కొని ప్రయాణించే పురుషులు నిలబడే ప్రయాణించాల్సి వస్తోందనే చర్చ గత కొంతకాలంగా జరుగుతోంది.ఈ నేపథ్యంలో 'పురుషులను గౌరవించడం మన సంప్రదాయం' అంటూ బోర్డులు ప్రత్యక్షమవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, ఈ బోర్డుల ఏర్పాటు అధికారికమా కాదా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. మేడ్చల్, బాలానగర్ డిపోలకు చెందిన పలు బస్సుల్లో ఈ బోర్డులు కనిపించినట్లు సమాచారం.

## హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన

హైదరాబాద్, పవర్ న్యూస్

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా తెలంగాణలో వర్షాలు విరామం లేకుండా కురుస్తున్నాయి. వీటి ప్రభావంతో నేడు హైదరాబాద్ నగరం వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు నగర ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుందని, పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిన్న హైదరాబాద్‌తో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కుండపోత వర్షం ముంచెత్తింది. గడిచిన 24 గంటల్లో కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 18.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా... వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోనూ భారీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రోడ్లపైకి వస్తున్న వాహనదారులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## లైంగిక దాడి ఆరోపణలు

**మొదటి పేజీ తరువాయి...**

తన వద్ద నుంచి రూ.5 లక్షలు తీసుకుని తిరిగి ఇవ్వకుండా మోసం చేశారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ఈ ఆరోపణలను రేగా కాంతారావు తన పిటిషన్‌లో తోసిపుచ్చారు. రాజకీయ, వ్యక్తిగత కారణాలతో తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఈ తప్పుడు కేసు బనాయించారని ఆయన పేర్కొన్నారు. నాలుగేళ్ల క్రితం జరిగినట్లు చెబుతున్న ఘటనలపై ఇప్పుడు ఫిర్యాదు చేయడం చట్టవిరుద్ధమని, అందువల్ల ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని ఆయన కోర్టును కోరారు. ఈ పిటిషన్ ఆగస్టు 5వ తేదీన జస్టిస్ బి.ఆర్. మధుసూదన్ రావు ధర్మాసనం ముందు విచారణకు వచ్చే అవకాశం ఉంది.

## ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే బాస్: జగ్గారెడ్డి

మొదటిపేజీ తరువాయి

రిపోర్టును సీల్డ్ కవర్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు ఆయన అందజేశారు.తుంగతుర్తి నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణలు, వర్గ విభేదాలపై గత పది రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇరువర్గాలు, స్థానిక నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలను సేకరించినట్లు జగ్గారెడ్డి తెలిపారు. ఆ వివరాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ నివేదికను రూపొందించినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన... ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే 'ఫస్ట్ బాస్' అని, ఆ తర్వాతి స్థానంలోనే ఎంపీ, మంత్రులు ఉంటారని స్పష్టం చేశారు. అలాగే మూడో ప్రాధాన్యత డీసీసీ అధ్యక్షుడికి ఉంటుందని వ్యాఖ్యానించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి సంబంధించిన వివాదాలు, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను కూడా ఈ నివేదికలో పొందుపరిచామని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీకి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు ప్రధాన స్తంభాలని ఈ సందర్భంగా జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# Chief Minister Revanth Reddy's Commitment to Complete Transparency in Police Recruitment is Commendable

**– Dr. Perumandla Ramakrishna**



**Hanumakonda, August 4:** Dr. Perumandla Ramakrishna, Senior Congress Party leader, welcomed the Telangana Government's decision to conduct the recruitment process for 7,437 police posts in a completely transparent and impartial manner, following the clear directions issued by Chief Minister Shri Revanth Reddy.He said that the Chief Minister's instructions to maintain the highest security standards at every stage—from question paper preparation to the conduct of examinations—and to closely monitor coaching centres, cyber fraud, fake websites, and misinformation campaigns reflect the government's strong commitment to transparency and integrity.Dr. Ramakrishna stated that the Chief Minister's assurance of a fair recruitment process for every deserving candidate, without allowing any malpractice or undue influence, has strengthened the confidence of Telangana's youth.He further said that providing employment opportunities to thousands of qualified young people while strengthening the state's police force will enhance law and order and contribute to a safer society.Dr. Ramakrishna added that the Chief Minister's initiatives simultaneously promote public safety, youth employment, and transparent governance. He said these measures will greatly benefit the future of Telangana, inspire confidence among aspiring candidates, and help build a more professional, efficient, and people-oriented police system in the state.

# హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై దాడులు: 25 టన్నులకు పైగా సరుకు స్వాధీనం

### 13 మసాలా తయారీ కేంద్రాలపై మెరుపు దాడులు చేశామన్న సజ్జనార్
### ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులు ఉపయోగిస్తున్నారని వెల్లడి
### కల్తీరాయుళ్లపై ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక



**హైదరాబాద్, పవర్ న్యూస్**

భాగ్యనగరంలో కల్తీ మసాలా తయారీ కేంద్రాలే లక్ష్యంగా H-FAST (Hyderabad Food Adulteration Surveillance Team) బృందాలు మెరుపు దాడులు నిర్వహించినట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఈ సోదాల్లో 25 టన్నులకు పైగా కల్తీ మసాలాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామని చెప్పారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో ఇప్పటివరకు మూడు కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.తనిఖీల్లో వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు వంటి నిత్యం వాడే మసాలా దినుసుల్లో తీవ్రస్థాయిలో కల్తీ జరుగుతున్నట్లు గుర్తించామని సజ్జనార్ తెలిపారు. ఆకర్షణీయమైన మెరుపు, రంగు కోసం ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులు, టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్‌ను వినియోగిస్తున్నారని వివరించారు. దాడుల సందర్భంగా సుమారు 89 టన్నుల ముడి పదార్థాలను సీజ్ చేసి, నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపించామని తెలిపారు. కల్తీరాయుళ్లపై ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇలాంటి రసాయనాలతో కూడిన కల్తీ మసాలాలు తీసుకోవడం వల్ల క్యాన్సర్, కాలేయం, మూత్రపిండాల వ్యాధులు, తీవ్రమైన అలర్జీలు, జీర్ణక్రియ సమస్యలు వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. H-FAST బృందం ఏర్పడిన 140 రోజుల్లోనే 659 ప్రాంతాల్లో సోదాలు చేసి, 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని, మొత్తం 246 టన్నుల కల్తీ ఆహారాన్ని సీజ్ చేశామని వెల్లడించారు. నగరంలో కల్తీ ఆహారంపై ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.





# నిరాహారదీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపిన చిలువేరు శ్రీనివాస్

**వరంగల్, ఆగస్టు 4(పవర్ న్యూస్):** దళిత క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో దళిత క్రైస్తవులకు రాజ్యాంగబద్ధ హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ శాంతియుత నిరాహార దీక్షలను గత రెండు రోజులుగా పోచమ్మ మైదానం లో ఈర్ల కుమార్ మాదిగ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు.భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి తనకు నచ్చిన మతాన్ని స్వేచ్ఛగా అవలంబించే హక్కును కల్పించింది. అయితే షెడ్యూల్డ్ కులాలకు చెందిన మాల, మాదిగ తదితర దళితులు క్రైస్తవ మతాన్ని స్వీకరించిన వెంటనే, 1950 రాష్ట్రపతి ఉత్తర్వు (గ్రాతీవంఱనవత్‌ఖుశ్రీ వాతీనవతీ, 1950) కారణంగా ఎస్సీ హోదా కోల్పోయి సామాజిక న్యాయానికి దూరమవుతున్నారు. ఇది రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ హక్కుకు విరుద్ధంగా ఉందని మేము భావిస్తున్నామని వరంగల్ జిల్లా ఎస్సి సెల్ కాంగ్రెస్ పార్టీ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ దళితులు మతం మార్చుకున్నంత మాత్రాన వారి సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనం లేదా కుల వివక్ష అంతరించిపోదు. "మతం మారినంత మాత్రాన కులం మారదు". అందువల్ల దళిత క్రైస్తవులకు కూడా ఎస్సీ హక్కులు, రిజర్వేషన్లు మరియు రాజ్యాంగ పరిరక్షణలు కొనసాగించాలని, దళిత క్రైస్తవుల సమస్యపై అధ్యయనం చేసిన రంగనాథ్ మిశ్రా కమిషన్ సహా పలు కమిషన్లు, దళిత క్రైస్తవులకు కూడా షెడ్యూల్డ్ కులాల హక్కులు కల్పించాలని సిఫారసు చేశాయి. అయినప్పటికీ ఇప్పటికీ తగిన చర్యలు తీసుకోకపోవడం విచారకరం.

అందువల్ల కేంద్ర ప్రభుత్వం వెంటనే 1950 రాష్ట్రపతి ఉత్తర్వులోని వివక్షాత్మక నిబంధనలను రద్దు చేసి, దళిత క్రైస్తవులకు రాజ్యాంగబద్ధ హక్కులు, ఎస్సీ హోదా మరియు అన్ని సంక్షేమ పథకాలను సమానంగా అమలు చేయాలని,దళిత క్రైస్తవులకు రాజ్యాంగ హక్కులు వెంటనే అమలు చేయాలని ఈ పార్లమెంట్ సమావేశం లోనే ఎస్సి దళిత క్రైస్తవులకు, ఎస్సి హోదా కల్పించాలని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ డిమాండ్ చేశారు.ఈ పార్లమెంట్ సమావేశం లోనే ప్రెసిడెన్సియల్ ఆర్డర్ రద్దు పరచి, దళిత క్రైస్తవులకు ఎస్సి హోదా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# తిరుమల శ్రీవారి భక్తులకు అలర్ట్... బ్రహ్మోత్సవాల్లో ఈ సేవలు రద్దు

భక్తులు మార్పులను గమనించి సహకరించాలని టీటీడీ విజ్ఞప్తి
కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక నిర్ణయం తీసుకుంది. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజుల పాటు తిరుమలలో అన్ని రకాల ఆర్జిత సేవలతో పాటు ప్రత్యేక ప్రవేశ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్న ఈ ఉత్సవాలకు లక్షలాదిగా తరలివచ్చే సామాన్య భక్తులకు పెద్దపీట వేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది.

## 2030 కల్లా డేటా సెంటర్లతో 4.3 లక్షల ఉద్యోగాలు

భారత డేటా కేంద్రాల రంగం 2030 కల్లా ప్రత్యక్షంగా, పరోక్షంగా 4.3 లక్షల ఉద్యోగాలను సృష్టించనుందని అంచనా. ఆ సమయానికి 250కి పైగా డేటా సెంటర్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలున్నట్లు స్థిరాస్తి సంస్థ స్క్వేర్ యార్డ్స్ తాజా నివేదికలో పేర్కొంది. రాబోయే సంవత్సరాల్లో డేటా సెంటర్ల వ్యవస్థ వల్ల ఇళ్లకు గిరాకీ కూడా పెరగనుందని తెలిపింది. దేశంలో కొత్తగా 9030 మెగావాట్ల డేటా సెంటర్ ప్రతిపాదనలున్నాయి. ఇవి 4.33 లక్షల ఉద్యోగాలను సృష్టించగలవు.




# అంతర్జాతీయ కమొడిటీల వల్లే టోకు ద్రవ్యోల్బణం పైకి



చేపట్టడం, వాణిజ్య విధానాలను సరిచూసుకోవడం వంటివి ఉన్నాయన్నారు. ఇందు వల్లే గత రెండు త్రైమాసికాలుగా రిటెయిల్/వినియోగదారు ధరల సూచీ(సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణ రేటు 4% దిగువనే ఉందన్నారు. టోకు ధరల సూచీ(డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం మే నెలలో 9.68% కాగా, జూన్‌లో 9.87 శాతానికి చేరింది. అంతర్జాతీయంగా పెట్రోలియం, ఇతర నూనెలు, ఆహార వస్తువులు, ప్రాథమిక లోహాలు, రసాయనాలు, రసాయన ఉత్పత్తుల ధరలు పెరగడంతో టోకు ధరలపై ఒత్తిడి కనిపించిందని మంత్రి వివరించారు.

వడ్డీ రేట్లు మారకపోవచ్చు: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పరపతి విధాన కమిటీ (ఎమ్‌పీసీ) సమావేశం సోమవారం మొదలైంది. ఈనెల 5న నిర్ణయాలు వెలువడతాయి. అంతర్జాతీయ అనిశ్చితులకు తోడు, ద్రవ్యోల్బణం పెరగడంతో ఈ సారి

అంతర్జాతీయ కమొడిటీ, ఇంధన వ్యయాల వల్లే, దేశీయంగా టోకు ధరల ద్రవ్యోల్బణం జూన్‌లో 9.87 శాతానికి పెరిగిందని ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌధ్రీ లోక్‌సభకు తెలిపారు. ద్రవ్యోల్బణ అదుపునకు, వినియోగదార్లపై దాని ప్రభావాన్ని తగ్గించడానికి కేంద్రం పలు చర్యలు చేపడుతోందని వివరించారు. నిత్యావసరాల నిల్వలు పెంచడం, బహిరంగ మార్కెట్లో ధాన్యం వ్యూహాత్మక విక్రయాలు కూడా ఎమ్‌పీసీ అప్రమత్తంగా వ్యవహరించొచ్చని, కీలక విధాన రేటు (5.25%)ను మార్పులేకుండా కొనసాగించి, వేచిచూసే ధోరణిని అవలంబించొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# నష్టాల్లో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో పాటు ఎఫ్‌ఎంసీజీ, బ్యాంక్, రియాల్టీ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ప్రభావం చూపాయి. దీంతో వరుసగా నాలుగు రోజుల సూచీల లాభాలకు బ్రేక్ పడింది. ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధాన నిర్ణయాలు బుధవారం వెలువడనుండడంతో మదుపర్లు అప్రమత్తత పాటించారు. సెన్సెక్స్ 210.08 పాయింట్లు క్షీణించి 78,428.95 వద్ద ముగిసింది. నిఫ్టీ 159.40 పాయింట్లు పతనమై 24,614.90 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.37గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్, ఇండిగో, టెక్‌మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ట్రెంట్, బజాజ్ ఫైనాన్స్, బీఈఎల్, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్ లిమిటెడ్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 85.58 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,047.14 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# భారీగా క్షీణించిన ఎల్ఐసీ షేర్లు..

ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ షేర్లు భారీగా కుంగాయి. మంగళవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో దాదాపు 9 శాతం మేర పతనమయ్యాయి. ఎల్ఐసీలో ఆఫర్ ఫర్ సేల్ రూపంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 6.5 శాతం వాటా విక్రయ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కావడమే ఇందుకు కారణం. మొత్తం 82.22 కోట్లకు పైగా షేర్లను ఈ ఇష్యూ ద్వారా విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆఫర్ ఫర్ సేల్‌లో భాగంగా 11 శాతం డిస్కౌంట్‌కు షేర్లను విక్రయిస్తుండడం ఎల్ఐసీ షేర్ల క్షీణతకు కారణమైంది. సోమవారం మార్కెట్ ముగిసే సమయానికి ఎన్ఎస్ఈలో ఎల్ఐసీ షేరు విలువ రూ.428.50గా ఉంది. ఈ ఇష్యూలో ఒక్కో షేరును రూ.382 ప్రాథమిక ధర వద్ద ప్రభుత్వం విక్రయిస్తోంది. దీంతో మంగళవారం ఉదయం ఎల్ఐసీ షేర్లు 9 శాతం మేర క్షీణించి రూ.390.50 వద్దకు చేరాయి. మార్కెట్ ముగిసే సమయానికి ఎల్ఐసీ షేరు 8.66 శాతం నష్టంతో రూ.391.40 వద్ద ముగిసింది. ఇష్యూకు పూర్తిగా స్పందన లభిస్తే కేంద్ర ఖజానాకు రూ.31 వేల కోట్లు లభించనున్నాయి. మంగళవారం రిటెయిలేతర మదుపర్లు, బుధవారం రిటెయిల్ మదుపర్లు ఆఫర్ ఫర్ సేల్‌లో పాల్గొనవచ్చు. మరోవైపు దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. గడిచిన నాలుగు రోజులుగా వరుస లాభాల్లో ట్రేడైన సూచీలు.. నేడు నష్టాలు ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ 210.08 పాయింట్ల నష్టంతో 78,428.95 వద్ద ముగిసింది. నిఫ్టీ 159.40 పాయింట్ల నష్టంతో 24,614.90 వద్ద స్థిరపడింది. ఐటీ, రియల్టీ స్టాక్స్‌లో అమ్మకాల కారణంగా సూచీలపై ఒత్తిడి పడింది.




## 58 కోట్లకు విమానాశ్రయాల వార్షిక ప్రయాణికుల సామర్థ్యం



దేశీయ విమానాశ్రయాల్లో ప్రయాణికుల వార్షిక నిర్వహణ సామర్థ్యం 58 కోట్లకు పెరిగిందని కేంద్ర పౌర విమానయాన సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ తెలిపారు. పలు విమానాశ్రయాల సామర్థ్యాన్ని పెంచడం, ఆధునికీకరణ ఇందుకు కారణమని అన్నారు. 2025-26లో దేశీయ విమానాశ్రయాల నుంచి 42 కోట్ల మంది రాకపోకలు సాగించారు. దేశంలో ప్రస్తుతం 166 విమానాశ్రయాలు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం ఆమోదం తెలిపిన 25 సరికొత్త విమానాశ్రయాల్లో 14 అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం దేశంలో 11 షెడ్యూల్డ్ విమానయానసంస్థల వద్ద 860 విమానాలు ఉన్నాయి. కొత్తగా 2056 విమానాల కొనుగోలుకు సంస్థలు ఆర్డర్లు ఇవ్వగా, అందులో 427 విమానాలు ఇప్పటికే డెలివరీ అయ్యాయి.

# యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు లేవు



డిజిటల్ చెల్లింపుల్లో ఎంతో కీలకంగా మారిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై రుసుములు విధించే ఆలోచన లేదని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. రూ.3,000 దాటిన యూపీఐ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్) వర్తింపచేసేందుకు ప్రభుత్వం, ఆర్‌బీఐ పరిశీలిస్తున్నాయంటూ జరుగుతున్న ప్రచారాన్ని తోసిపుచ్చింది. డిజిటల్ చెల్లింపులు పూర్తిగా ఉచితంగానే కొనసాగుతాయని తేల్చి చెప్పింది. పేమెంట్స్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టం 2007లోని సెక్షన్ 10ఏ ప్రకారం యూపీఐ ద్వారా జరిపే చెల్లింపులకు బ్యాంకులు, సేవా సంస్థలు ఎలాంటి రుసుమూ వసూలు చేయకూడదు. సీబీడీటీ నోటిఫికేషన్ ప్రకారం భీమ్-యూపీఐ, యూపీఐ క్యూఆర్, రూపే డెబిట్ కార్డు లావాదేవీలపై ఎండీఆర్‌ను సున్నా శాతంగా నిర్ణయించారు.

కొన్నింటికి: యూపీఐ లావాదేవీలు పూర్తి ఉచితంగానే ఉన్నప్పటికీ.. కొన్ని ప్రత్యేక లావాదేవీలకు వేర్వేరు నిబంధనలు వర్తిస్తాయి.

వాలెట్లు (పీపీఐ): వాలెట్ల ద్వారా యూపీఐ ఉపయోగించి జరిపే రూ.2,000 పైబడిన వర్తక లావాదేవీలకు గరిష్ఠంగా 1.1% ఇంటర్‌ఛేంజ్ రుసుము వర్తిస్తుంది. రూపే క్రెడిట్ కార్డులు: యూపీఐతో అనుసంధానించిన రూపే క్రెడిట్ కార్డు చెల్లింపులకు సాధారణ క్రెడిట్ కార్డు ఎండీఆర్ వర్తిస్తుంది.




## టీమ్ఇండియా నెట్ బౌలర్లుగా నలుగురు స్పిన్నర్లు



ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో భారత్ (SL vs IND) రెండు టెస్టుల సిరీస్‌లో తలపడనుంది. స్పిన్ బౌలింగ్‌కు అనుకూలించే అక్కడి పిచ్‌లపై భారత బ్యాటర్లు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు టీమ్ మేనేజ్‌మెంట్ కీలక నిర్ణయం తీసుకుంది. యువ స్పిన్నర్లు విప్రాజ్ నిగమ్, తనుష్ కొటియన్, హర్ష్ దూబె, శివాంగ్ కుమార్‌లను నెట్ బౌలర్లుగా ఎంపిక చేసింది. వీరు సోమవారం జట్టుతో పాటే శ్రీలంకకు బయలుదేరారు. ఈ నలుగురు స్పిన్నర్లు టీమ్ఇండియా ఆటగాళ్లకు నెట్స్‌లో బౌలింగ్ చేస్తారు. ఇటీవల విప్రాజ్ నిగమ్ శ్రీలంకలో ఇండియా ఎ తరఫున ముక్కోణపు సిరీస్‌లో రాణించాడు. ఇక, లంక టూర్‌కు ఎంపికైన ప్రధాన జట్టులో రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్ వంటి అనుభవజ్ఞులైన స్పిన్నర్లు ఉన్నారు. వీరికి తోడుగా మానవ్ సుతార్, సరాంశ్ జైన్ జట్టులో చేరారు. ఆగస్టు 7 నుంచి కొలంబోలో శ్రీలంక ఎలెవన్‌తో భారత్ మూడు రోజుల వార్మప్ మ్యాచ్ ఆడనుంది.

# ఆ ఒక్కసారే కేఎల్ రాహుల్ కోపంగా ఉండటం చూశా: వసీం జాఫర్

భారత బ్యాటర్ కేఎల్ రాహుల్ వివాదాల జోలికి వెళ్లకుండా.. మైదానం లోపలా బయటా ప్రశాంతంగా ఉంటాడు. ఐపీఎల్‌లో పలు ఫ్రాంచైజీలకు సారథిగా వ్యవహరించిన అతడు.. ఉత్కంఠభరిత మ్యాచ్‌ల్లోనూ కూల్‌గా ఉండటం మనం చూశాం. ఆటగాళ్లు తప్పులు చేసినా వారితో సౌమ్యంగా మాట్లాడుతాడు. అలాంటి రాహుల్.. ఓ సందర్భంలో కోపంగా ఉండటం చూశానని పంజాబ్ కింగ్స్ మాజీ హెడ్ కోచ్ వసీం జాఫర్ అన్నాడు. అతడు కోపగించుకోవడం అదే చివరిసారి కూడా అని తెలిపాడు. 2018-2021 వరకు పంజాబ్‌కు ప్రాతినిధ్యం వహించిన రాహుల్ కెప్టెన్‌గానూ సేవలదించాడు. ఆ సమయంలో పంజాబ్ కోచ్‌గా వసీం జాఫర్ ఉన్నాడు. 2020, 2021 సీజన్లలో ఆటగాడిగా రాహుల్ మంచి ప్రదర్శన చేసినప్పటికీ పంజాబ్ ఆరో స్థానంలో నిలిచింది. చాలా మ్యాచ్‌ల్లో గెలిచే స్థితిలో ఉండి కూడా చివరకు స్వల్ప తేడాతో పరాజయాలు చవిచూసింది. అది రాహుల్‌ను తీవ్ర నిరాశకు గురిచేసిందని జాఫర్ పేర్కొన్నాడు. ''కేఎల్ సహజంగానే చాలా ప్రశాంతంగా ఉంటాడు. కాస్త మితభాషి. ఎవరితోనూ ఎక్కువగా కలవడు. అందుకే బయట పెద్దగా కనిపించడు. మైదానంలో గానీ, బయట గానీ అతడు సహనం కోల్పోవడం, కోప్పడటం చాలా అరుదు. కానీ నేను పంజాబ్ జట్టుకు కోచ్‌గా ఉన్నప్పుడు ప్రతి మ్యాచ్ కూడా తీవ్ర నిరాశను మిగిల్చింది. గెలిచే స్థితిలో ఉండి కూడా మేము మ్యాచ్‌లు ఓడిపోయాం.s సునాయసంగా గెలవాల్సిన ఒక మ్యాచ్ చేజారడంతో రాహుల్‌కు కోపం వచ్చింది. ఆ రోజు అతడు తప్పుగా మాట్లాడలేదు. జట్టు ఆట తీరు పట్ల ఎంతగా అసహనానికి గురయ్యాడో స్పష్టంగా అర్థమైంది. రాహుల్‌ను కోపంగా చూసిన ఏకైక సందర్భం అదే'' అని వసీం జాఫర్ అన్నాడు.



# లుసానె డైమండ్ లీగ్ బరిలో నీరజ్ చోప్రా



ఇటీవల కామన్వెల్త్ క్రీడల్లో రజత పతకం సాధించిన భారత స్టార్ జావెలిన్ త్రో ప్లేయర్ నీరజ్ చోప్రా మరో పోటీకి సిద్ధమవుతున్నాడు. ఆగస్టు 21న జరగనున్న లుసానె డైమండ్ లీగ్‌లో అతడు బరిలోకి దిగనున్నాడు. ఈ ఏడాది డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో నీరజ్ పోటీ పడాలంటే.. లుసానె టోర్నీ అతడికి అత్యంత కీలకం.

బ్రసెల్స్ వేదికగా సెప్టెంబరు 4-5 తేదీల్లో డైమండ్ లీగ్ ఫైనల్స్ జరగనున్నాయి. దీనికి నీరజ్ ఇంకా అర్హత సాధించలేదు. రబత్, రోమ్ లీగ్‌లకు దూరంగా ఉన్న అతడు.. జూన్‌లో జరిగిన దోహా డైమండ్ లీగ్‌లో జావెలిన్‌ను 85.69 మీటర్ల దూరం విసిరి నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ప్రస్తుతం డైమండ్ లీగ్ ఫైనల్ పాయింట్ల పట్టికలో నీరజ్ ఐదు పాయింట్లతో ఏడో స్థానంలో ఉన్నాడు. ఫైనల్స్‌కు అర్హత సాధించాలంటే లుసానె లీగ్ లేదా ఆగస్టు 27న జరిగే జ్యూరిచ్ లీగ్‌లలో కనీసం ఒకదాంట్లోనైనా మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంది. లుసానె పోటీల్లో రుమేశ్ తరంగ (శ్రీలంక), అర్షద్ నదీమ్ (పాకిస్థాన్), కెషోర్న్ వాల్కాట్ (ట్రినిడాడ్ అండ్ టొబాగో), అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), జులియన్ వెబర్ (జర్మనీ), కర్టిస్ థాంప్సన్ (అమెరికా) నుంచి నీరజ్‌కు గట్టిపోటీ ఎదురుకానుంది.

కామన్వెల్త్ గేమ్స్ 2026లో స్వర్ణం లక్ష్యంగా బరిలోకి దిగిన నీరజ్ ఆఖరిదాకా గట్టిగానే పోరాడినా.. అతడికి రజత పతకమే (85.83 మీ) లభించింది. రుమేశ్ పతిరగె 89.75 మీటర్ల త్రో వేసి స్వర్ణం ఎగరేసుకుపోయాడు.

# ఆకిబ్ నబి వచ్చేశాడు..

జమ్మూకశ్మీర్ ఫాస్ట్ బౌలర్ ఆకిబ్ నబికి తొలిసారి భారత జట్టులో చోటు దక్కింది. గాయంతో వైదొలగిన బుమ్రా స్థానంలో శ్రీలంకలో రెండు టెస్టుల సిరీస్‌కు సెలక్షన్ కమిటీ అతణ్ని ఎంపిక చేసింది. దీంతో కశ్మీర్ నుంచి భారత టెస్టు జట్టుకు ఎంపికైన తొలి ఆటగాడిగా నబి ఘనత సాధించాడు. లంక పర్యటనకు ముందు ప్రకటించిన జట్టులో బుమ్రా ఉన్నాడు. కానీ ఎడమ మోకాలి గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో అతడు సిరీస్‌కు దూరమయ్యాడు. ''సెలక్షన్ కమిటీ.. బుమ్రా స్థానంలో ఆకిబ్ నబిని ఎంపిక చేసింది. జమ్మూకశ్మీర్ ఫాస్ట్ బౌలర్ తొలిసారి సీనియర్ జాతీయ జట్టులో చోటు దక్కించుకున్నాడు'' అని బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. కశ్మీర్‌లో బారాముల్లాలోని ఓ మారుమూల గ్రామానికి చెందిన 29 ఏళ్ల నబి.. పర్వేజ్ రసూల్, ఉమ్రాన్ మాలిక్ తర్వాత జాతీయ జట్టుకు ఎంపికైన జమ్మూకశ్మీర్ ఆటగాడిగా నిలిచాడు. నబి గత రెండు రంజీ సీజన్లలో 104 వికెట్లు పడగొట్టాడు. 2025-26 సీజన్లో 60 వికెట్లు పడగొట్టి, జమ్మూకశ్మీర్ జట్టు రంజీ ట్రోఫీ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. రసూల్, మాలిక్ భారత్ తరఫున పరిమిత ఓవర్ల క్రికెట్ ఆడారు. నబి ఇంతకుముందు శ్రీలంకలో పర్యటించిన భారత్-ఎ జట్టులో ఉన్నాడు. ఆ సిరీస్‌లో రెండు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో ఆరు వికెట్లు పడగొట్టాడు. భారత్, శ్రీలంక మధ్య తొలి టెస్టు ఈ నెల 15న మొదలవుతుంది.



# అఖిలేశ్‌పై ఎనిమిదేళ్ల నిషేధం



అమెరికాకు ప్రాతినిధ్యం వహిస్తున్న భారత సంతతి క్రికెటర్ అఖిలేశ్ రెడ్డిపై ఎనిమిదేళ్ల నిషేధం పడింది. 2025 అబుదాబి టీ10 టోర్నీలో ఆస్పిన్ స్టాలియన్స్‌కు ప్రాతినిధ్యం వహించిన ఈ ఆఫ్ స్పిన్నర్.. రెండు మ్యాచ్‌లు ఆడాడు. ఒక మ్యాచ్‌కు ముందు ఉద్దేశపూర్వకంగా పరుగులు ఇవ్వాలని సహచరుడిని అఖిలేశ్ కోరగా, అతడు అవినీతి నిరోధక విభాగానికి సమాచారం అందించినట్లు సమాచారం. ఫిక్సింగ్‌కు పాల్పడడం, మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేయడానికి ప్రయత్నించడం, కుట్ర పన్నడం తదితర నేరాల కింద గత నవంబర్‌లో అఖిలేశ్‌ను ఐసీసీ తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. నిబంధనలను మీరినట్లు ఐసీసీ అవినీతి నిరోధక ట్రైబ్యునల్ తేల్చడంతో ఈ స్పిన్నర్‌పై ఎనిమిదేళ్ల నిషేధం పడింది. గత సంవత్సరం ఏప్రిల్‌లో అమెరికాకు అరంగేట్రం చేసిన 26 ఏళ్ల అఖిలేశ్.. 4 టీ20లు ఆడి ఒక వికెట్ తీశాడు. హైదరాబాద్‌కు చెందిన అఖిలేశ్.. విజయ్‌హజారే ట్రోఫీలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు నెట్ బౌలర్‌గా కూడా సేవలందించాడు. తర్వాత మెరుగైన అవకాశాల కోసం అమెరికాకు వలస వెళ్లాడు.